ప్రజాశక్తి

ఆదివారం 22 డిసెంబర్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న మంత్రి స్వామి

రెవెన్యూ సదస్సుల్లో

వైసిపి అరాచకాలు వెలుగులోకి..

- గత ఐదేళ్లలో భూమాఫియా ముఠా రాష్ట్రంలో వేలాది ఎకరాలు కొట్టేసింది..
- భూ కబ్జాదారులపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం
- రాష్ట్ర మంత్రి స్వామి

ప్రజాశక్తి-పొదిలి, మర్రిపూడి

అధికారాన్ని అడ్డుపెట్టుకుని గత ఐదేళ్లు వైసీపీ భూ మాఫియా ముఠా రాష్ట్రంలో వేలాది ఎకరాలు కొట్టేసిందని, నేడు రెవెన్యూ సదస్సుల్లో వైసీపీ అరాచకాలు బయటికి వస్తున్నాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం ప్రకాశం జిల్లా మర్రిపూడి, మండలం అయ్యపురాజుపాలెం, పొదిలి మండలం, పొదిలిలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో మంత్రి స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించి సంబంధిత సమస్యల గురించి సవివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. వారసత్వంగా వచ్చిన భూ హక్కు సంబంధిత వారసులకు అందిచడమే లక్ష్యమన్నారు. అవసరమైతే ఈ సదస్సుల నిర్వహణ గడువును పొడిగించడానికి కూడా తమ ప్రభుత్వం వెనుకాడదన్నారు. రెవెన్యూ మంత్రి, ▶ 2లో

సాగునీటి సంఘాల

వ్యవస్థలకు పునరుజ్జీవం

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి
- కృష్ణా, పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా మురళీధరరావు
- కూటమి పక్షాన ఏకగ్రీవంగా ఎన్నికయిన చైర్మన్, వైస్ చైర్మన్లు



చైర్మన్‌గా ఎన్నికయిన మురళీధరరావును సత్కరిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అలంకారప్రాయంగా మారిన సాగునీటి సంఘాల వ్యవస్థలన్నీ పునరుజ్జీవం పోసుకుంటున్నాయని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బాపట్ల జిల్లా పరిధిలోని కృష్ణా, పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలు అమర్తలూరు మండలం, కూచిపూడి గ్రామంలోని జలవనరుల శాఖ డిఈ కార్యాలయంలో శనివారం జరిగాయి. చైర్మన్ పదవికి పంతాని మురళీధరరావు, వైస్ చైర్మన్ పదవికి నువ్వుల సునీల్‌చౌదరి నామినేషన్ దాఖలు చేశారు. సంఘాల కమిటీ సభ్యులంతా వారిద్దరికే మద్దతిచ్చారు. దీంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి, జిల్లా జలవనరుల శాఖ ఎస్‌ఈ ఎస్‌కె.అభూతలీమ్ అధికారికంగా ప్రకటించారు. చైర్మన్‌గా పంతాని మురళీధరరావు, వైస్ చైర్మన్‌గా నువ్వుల సునీల్ చౌదరి ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. నీటిసంఘాల చైర్మన్, వైస్ చైర్మన్లకు కార్యక్రమానికి హాజరైన జిల్లా ఇంచార్జి మంత్రి పార్థసారథి, వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనంద్‌బాబు, ప్రత్తిపాడు శాసనసభ్యులు బి.రామాంజనేయులు, అధికారులు అభినందనలు తెలిపారు.

చివరి భూమికి సాగునీరు అందించడమే లక్ష్యం

కాలువ చివర ఉన్న ప్రతి భూమికీ సాగునీరు తీసుకువెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పార్థసారథి తెలిపారు. జలవనరులు, వ్యవసాయ రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడానికి సీఎం అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. నీటి సంఘాల వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దష్టి సారించారన్నారు. వ్యవసాయ రంగంలో అడ్డంకులన్నీ తొలగించి, రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు కషి చేస్తున్నారని తెలిపారు. ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవడానికి సాగునీటి సంఘాల వ్యవస్థ చాలా అవసరమని ప్రభుత్వం గుర్తించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలతో నిర్వీర్యం అయిపోతున్న నీటి సంఘాలు పునర్జీవం పోసుకుంటున్నాయని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయన్నారు. ఇందుకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి, హెచ్‌ఆర్‌డి, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులంతా కలిసి పనిచేస్తున్నారన్నారు. సంఘాలు బలంగా ఉంటే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీంతో కృష్ణా, పశ్చిమ డెల్టా కింద ఉన్న నీటి సంఘాలన్నీ బలంగా మారతాయన్నారు. తద్వారా ▶ 2లో

ఇది మనుషులుండే హాస్టల్లా లేదు..

- మీ పిల్లల్నీ ఇలాగే చూసుకుంటారా.?
- గురుకులంలో పిల్లలంటే ఇంత నిర్లక్ష్యమా.?
- బాపట్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ భవానీపై రాష్ట్ర చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు పద్మావతి ఆగ్రహం



విద్యార్థుల కోసం చేసిన అల్పాహారాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బాపట్ల

'నువ్వూ అమ్మవేగా.. మీ పిల్లల్ని కూడా ఇలాగే చూసుకుంటారా.! అపరిశుభ్రంగా ఉన్న వసతిగహంలో విద్యార్థులకు అంటు వ్యాధులు ప్రబలితే ఎవరు బాధ్యత వహిస్తారు.? ఎక్కడెక్కడ నుండో గురుకుల పాఠశాలలో చదువుకునే నిరుపేద విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాల్సిన మీరు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు..' అని బాపట్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ భవానీపై రాష్ట్ర చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు బి.పద్మావతి మండిపడ్డారు. మొత్తంగా హాస్టల్ పరిస్థితి చూస్తే మనుషులు ఉండే హాస్టల్లా కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలో అన్నం సతీష్ ప్రభాకర్ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన మండల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్కడి కార్యక్రమంలో పాల్గొనే ముందు బాపట్ల చేరుకున్న ఆమె ఆకస్మికంగా పట్టణంలో అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా బాపట్ల గురుకులం ఉందని ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బందిపై మండిపడ్డారు. బాలికల గురుకులంలో అనేక సమస్యలను విద్యార్థులు పద్మావతి దష్టికి తెచ్చారు. మరుగుదొడ్లకు తలుపులు లేవని, సక్రమంగా నీటి సరఫరా కూడా జరగడం లేదని చెప్పారు. రోజుకు ఒక్క పూటే నీళ్లు వస్తాయన్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలు సైతం అంత నాణ్యంగా లేదని ఆమె గుర్తించారు. విద్యార్థులకు సరిపడా పాలు అందజేయడం లేదని, మిగిలిపోయిన అన్నం పాఠశాల ప్రాంగణంలోనే డబ్బాలో వేసి ఉంచారని, అది దుర్వాసన వెదజల్లుతోందన్నారు. విద్యార్థులకు అల్పాహారంగా అందించే ఇడ్లీలను ఆమె పరిశీలించారు. దీనిపై విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయుల సమావేశంలో పద్మావతి మాట్లాడారు. బాపట్ల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఉన్న పరిస్థితిని ఈ సందర్భంగా ఆమె వివరించారు. ప్రిన్సిపాల్ భవానీకి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలను మూసేస్తామన్నారు. ప్రధానంగా మేదరమెట్ల ప్రైవేటు పాఠశాల సరైన అనుమతులు లేవన్నారు. నాగార్జున స్కూలు, చీరాల భాష్యం వంటి ప్రైవేట్ పాఠశాలలు మరుగుదొడ్లు సరిగ్గా లేవని గుర్తించామన్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడం అర్హులైన ఉపాధ్యాయులు లేరన్నారు. ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించారని, దానికి సరిపడా సౌకర్యాలు లేవని ▶ 2లో

డిఎంహెచ్‌ఒగా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బాపట్ల జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ తెలగతోటి వెంకటేశ్వర్లు ఉద్యోగోన్నతిపై ప్రకాశం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా బదిలీ అయ్యారు. శనివారం నాడు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.



వెంకటేశ్వర్లు (ఫైల్)

స్వల్ప భూప్రకంపనలు

- ముండ్లమూరు, తాళ్లూరులో ఉలిక్కిపడ్డ ప్రజలు

ప్రజాశక్తి-ముండ్లమూరు, తాళ్లూరు

ముండ్లమూరు, తాళ్లూరు, మండలాల్లో శనివారం ఉదయం భూ ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముండ్లమూరు మండలంలో శనివారం ఉదయం 10:30 గంటల సమయంలో పెద్ద శబ్దంతో కూడిన భూ ప్రకంపనలు కొన్ని సెకండ్ల పాటు రావడంతో ప్రజలు ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు. ఈ భూ కంపానికి ఇళ్లల్లోని సామాన్లు, గోడలకు నెర్రెలిచ్చాయి. మండలంలోని ఈదర, పూరిమెట్ల, భీమవరం, ఉమామహేశ్వరపురం, పోలవరం, శంకరాపురం, వేముల తదితర గ్రామాలలో పెద్ద శబ్దంతో కూడిన భూమి ప్రకంపనలు రావడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. గత నాలుగైదు సంవత్సరాలలో ఏడు సార్లు భూ ప్రకంపనలు రావడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.



ముండ్లమూరులో భూప్రకంపనల కారణంగా ఓ ఇంటి అటకపై నుంచి పడిన సామాన్లు

అక్రమిత ప్రభుత్వ భూమి స్వాధీనం

సాగునీటి సంఘాల వ్యవస్థలకు పునరుజ్జీవం

(మొదటిపేజీ తరువాయి)

రైతులు లబ్ధి పొందుతారని చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం ఇప్పటికే జాప్యంపై ప్రభుత్వానికి రూ.వేల కోట్ల నష్టం వచ్చిందన్నారు. ఇక నుంచి జాప్యం లేకుండా నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గడిచిన ఐదేళ్లలో రైతులు సుమారుగా రూ.10 వేల కోట్లు నష్టపోయారన్నారు. చింతలపూడి ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందించే దిశగా ప్రజాప్రతినిధులంతా ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన సాగుతోందని వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనంద్‌బాబు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రైతుల అభివద్ధి కోసం నీటిసంఘాల ఎన్నికలు జరిగాయన్నారు.

రైతుల అభివృద్ధికి వారే పరిపాలన సాగించుకునే వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేస్తుందని ప్రత్తిపాడు శాసనసభ్యులు బి.రామాంజనేయులు తెలిపారు. రైతులే రాజులు కావాలని ప్రభుత్వం ఉద్దేశించిందన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం విశేషంగా కషి చేస్తోందన్నారు. రైతుల అభివద్ధి కోసం ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. కార్యక్రమానికి ఎన్నికల అధికారి ఎస్ కె అభూతలీమ్, జలవనరుల ప్రాజెక్టు గుంటూరు ఎస్ఈ పి వెంకటరత్నం, రేపల్లె ఆర్డిఒ రామలక్ష్మి, సహాయ ఎన్నికల అధికారి, చీరాల డిఈ ఎన్‌కెవి ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, నీటి పంపిణీ సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో వైసిపి అరాచకాలు వెలుగులోకి..

(మొదటిపేజీ తరువాయి)

ప్రిన్సిపల్ సెక్రటరీ, సి.సి.ఎల్.ఏ. జనవరి మొదటి వారంలో మన జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో పర్యటిస్తారని తెలిపారు. పొదిలి మండలంలో 9400 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేస్తే వాటిలో 706 ఎకరాలలో అక్రమాలు జరిగాయన్నారు. తమపై కుటుంబాలు ఆధారపడిన విషయాన్ని గుర్తెరిగి అధికారులు అక్రమాలకు ఆస్కారం లేకుండా పనిచేయాలని మంత్రి చెప్పారు. వేణుగోపాలస్వామి భూముల వల్ల సర్వే నెం.251 లోని ప్రజల భూములు కూడా నిషేధిత జాబితాలో ఉన్నందున రిజిస్ట్రేషన్ చేయలేని సమస్య తలెత్తిందని, దీని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అన్యాక్రాంతమైన ఆరామక్షేత్రం విషయంలో సర్వే చేసి బి.సి.లకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పొదిలిలోని పథులగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి భూముల్లో గోశాల నిర్మిస్తే అభ్యంతరం లేదని, ఇతర నిర్మాణాలు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా దేవాలయానికి ఆదాయం వచ్చేలా కళ్యాణ మండపం వంటి నిర్మాణాలు చేపట్టడాన్ని పరిశీలిస్తామన్నారు.

వచ్చే మూడు ఏళ్లలోపే తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఈ దిశగా అన్ని జిల్లాల అధికారులతో ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. గతంలో జన్మభూమి కార్యక్రమం ద్వారా ప్రజలవద్దకే పరిపాలన తీసుకువచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రాబాబు నాయుడు తాజాగా రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతోనే అధికారులను ప్రజల వద్దకు చేర్చి రెవెన్యూ సదస్సులు నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పొదిలి – మర్రిపూడి రోడ్డును 2018లో తమ ప్రభుత్వంలో మంజూరు చేయించామని, అనంతరం ప్రభుత్వం మారిందని, మళ్లీ తామ అదే కాంట్రాక్టరుతో మొదలు పెడుతున్నామని మంత్రి చెప్పారు. వచ్చే నెలలోనే పనులు ప్రారంభమవుతాయని మంత్రి స్వామి తెలిపారు.

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలంలోగత కొంతకాలంగా భూ కబ్జాదారులు ప్రభుత్వ భూమిని స్వేచ్ఛగా ఆక్రమించుకొని అనుభవిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లతో రెవెన్యూ అధికారులు భూఆక్రమణలను ఆపలేక సతమతమవుతున్నారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం భూఆక్రమణ లు, భూకబ్జాదారులపై ఉక్కు పాదంతో మోపి భూఆక్రమణలకు అడ్డుకట్ట వేసింది. మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్ అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని భూకబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకుని ప్రభుత్వం ఆధీనంలోకి తెచ్చారు. రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టర్ త్రివినాగ్ శనివారం రాచర్ల మండలం సోమీదేవిపల్లె రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిదేవిపల్లి, సంఘపేట గ్రామాల పరిధిలో 453,454 సర్వే నెంబర్లలో గల 20.39 ఎకరాల ఆక్రమిత అటవీ పోరంబోకు ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుండి భూమిని స్వాధీనం చేసుకొని హద్దులు ప్రకటించారు. ఆక్రమిత ప్రభుత్వ భూమిలో తిరిగి ఎలాంటి ఆక్రమణలు జరగకుండా సబ్ కలెక్టర్ త్రివినాగ్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు పెట్టారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దారు ఎల్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూములు సాగుదారులకు పట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన సోమవారప్పాడు భూములను సాగుచేసుకుంటున్న వ్యవసాయ కూలీలకు పట్టాలు ఇవ్వాలని శనివారం తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ ఈ భూములను 1985 నుంచి భూమిలేని వ్యవసాయ కూలీలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొంతమంది రైతులకు తాత్కాలిక పట్టాలు ఇచ్చిన వారందరి పట్టాలు రద్దుచేసి భూమిలేని నిజమైన వ్యవసాయ కూలీలకు పట్టాలు ఇవ్వాలని తెలియజేశారు. రీ సర్వేలో భాగంగా ఆ భూములు కూడా సర్వే చేయాలని, గతంలో రైతులకు ఆన్‌లైన్ చేసి ఉంటే వాటిని రద్దుచేసి సాగు చేసుకుంటున్న కూలీలకు ఆ భూమిని అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న వారిని ఉద్దేశించి తహశీల్దారు పి మధుసూదనరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని, అవి అయిపోయిన అనంతరం ఈ భూములను సర్వే చేయించి వాటిపై రిపోర్టు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి, ప్రకాశం, పిల్లి కృష్ణ, సాగు చేసుకుంటున్న రైతులు పాల్గొన్నారు.

'రైజ్'లో ధ్యాన దినోత్సవం

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని వల్లూరు సమీపంలోని రైజ్ కృష్ణ సాయి గ్రూప్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ శిద్దా వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధాన శిక్షకుడిగా ఆంధ్రప్రేదేశ్ రాష్ట్ర పతంజలి యోగాపీఠ్ అధ్యక్షులు యోగాచార్య బాలసుబ్రమణ్యం గంధవల్ల, పతంజలి యోగ పీట్ జిల్లా అధ్యక్షులు బోయపాటి రవి వారి బృందం కళాశాలకు విచ్చేసి విద్యార్థులకు మెడిటేషన్ యొక్క ప్రాముఖ్యత, ఉపయోగాలు, పాటించవలసిన నియమాలు లాంటి అంశాలపై శిక్షణ ఇచ్చారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు తెలిపారు.

ఇది మనషులుండే హాస్టల్లా లేదు

(మొదటిపేజీ తరువాయి)

చీరాల భాష్యం స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డీఈఓకు సూచించారు. మక్కినవారిపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు సరైన ఆహార పదార్థాలు అందించడం లేదన్నారు. మెనూలో లేని ఆహారం ఉప్మా ఎందుకు వండి పెడుతున్నారని ప్రశ్నించారు. ఆ పాఠశాల మధ్యాహ్న భోజనం తయారు చేసే ఎన్‌డిఎం సిబ్బందికి ఛార్జి మెమో ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఈవో ఎస్ పురుషోత్తం, సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఈ.మురళి, డిప్యూటీ డిఇఒ ఏ శ్రీనివాసరావు, డివిఈవో ఎర్రయ్య, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాల ప్రతినిధులు, గురుకులాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

దళిత, ప్రజా సంఘాల డిమాండ్



నిరసన తెలియజేస్తున్న దళిత సంఘాల నాయకులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

భారత పార్లమెంట్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తూ హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను దళిత, ప్రజా సంఘాలు శనివారం రాత్రి తీవ్రంగా ఖండించారు. హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. శింగరాయకొండ మండల కేంద్రంలో దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవమానిస్తూ కేంద్ర హెూం మంత్రి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశిస్తూ అంబేద్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షులు పులగర కృష్ణయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు నిండిన సందర్భంగా భారత పార్లమెంట్‌లో రెండు రోజులు చర్చ జరిగిందన్నారు. ఈ చర్చ సందర్భంగా అమిత్‌షా డాక్టర్ బిఆర్‌ను అంబేద్కర్, అంబేద్కర్ అంటూ స్మరించటం ఫ్యాషన్ అయిపోయిందని వ్యాఖ్యానించినట్లు తెలిపారు. ఆ పేరు బదులు దేవుని స్మరిస్తే ఏడు తరాల సరిపడా స్వర్గంలో స్థానం లభిస్తుందని మాట్లాడి డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ని అవమానించాడని తెలిపారు. అమిత్‌షా స్పష్టంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పట్ల తన వ్యతిరేకతను ప్రకటించాడని తెలిపారు. అమిత్ షాను క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహన్, పులగర కృష్ణయ్య, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రాజశేఖర్, ఊళ్ళపాలెం మాజీ సర్పంచ్ ఆరేటి లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఎంప్లాయిస్ నాయకుడు నాగేశ్వరరావు, చోప్పర వెంకన్న, పెరికల, సునీల్ కుమార్, రామకోటయ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కె.నాంచార్లు, ముస్లిం మైనార్టీ సుల్తాన్, దమ్మాల నాగేశ్వరరావు, కె.భాస్కర్, వై.ఉజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నివారణపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - చీరాల

షాడోస్ సంస్థ మరియు స్ఫూర్తి క్లబ్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవి మరియు ఏఆర్టీ మందుల గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ డేవిడ్సన్ సాల్మన్ మాట్లాడుతూ ఏఆర్టీ మందులను క్రమం తప్పకుండా వేసుకోవాలని అలా వాడటం వలన అనారోగ్యం బారిన పడకుండా ఉంటారని తెలియజేశారు. ఏవైనా ఇతర ఆరోగ్య సమస్యలు వస్తే హాస్పిటల్‌కి వచ్చి చూపించుకోవాలని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని తెలియజేశారు. షాడోస్ రాజా సాల్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని, దాని ద్వారా రక్తహీనత కలగకుండా ఉంటుందన్నారు. అలాగే మందులు వాడే వాళ్ళందరూ మంచి ఆహారం తీసుకోవాలని తెలియజేశారు. షాడోస్ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ స్ఫూర్తి క్లబ్ వారి సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందని దీని ద్వారా సిఎల్‌హెచ్‌ఏలకు పోషకాహారం అందుతుందని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని ఇంకా అనేకమంది సహాయం అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 30 మంది సిఎల్‌హెచ్‌ఏలకు పోషక విలువలు గల ఆహారం పుస్తకాలు మరియు నూతన దుస్తులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేర్ రివర్స్ ప్రభుదాసు, భాగ్యలక్ష్మి, శంకరి అలేఖ్య, మరియు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-వేమూరు

గ్రామాల్లో రైతుల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని వేమూరు తహశీల్దార్ సుశీల తెలిపారు. మండలంలోని జంపనిలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి పలు రకాల సమస్యలపై అర్జీలను స్వీకరించారు. భూమి కొలతలలో తేడాలు ఉన్నట్లయితే వాటిని మరోసారి నిర్వహించనున్న ఈ సర్వే కార్యక్రమాల ద్వారా పూర్తిస్థాయిలో పరిష్కారం అవుతాయన్నారు.


వేమూరులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం, పెదపులివర్రు గ్రామంలో శనివారం మండల తాసిల్దార్ మేక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని తాసిల్దార్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నీలా ఉషారాణి రమేష్, ఆర్. ఐ ఫణికుమార్, వీఆర్వో చిట్టిబాబు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, తదితరులున్నారు.


కొల్లూరు గ్రామసభలో పాల్గొన్న అధికారులు

కొల్లూరు: కొల్లూరు మండల పరిధిలోని గురివిందపల్లి, చినపులివర్రు గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న భూ సమస్యలు వివాదాలు పరిష్కరించాలనే ఉద్దేశంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులో మొత్తం 3 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా భూగర్భ జలాల అధికారి కె.రామ బాలాజీ డిప్యూటీ తహశీల్దార్ ఎన్.శ్రీనివాసరావు, మండల సర్వేయర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆపరేషన్ వికటించి ఆర్మీ జవాన్ మృతి

అధికార లాంఛనాలతో అంతిమయాత్ర


శ్రీనివాసరావు(ఫైల్)

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ట్రాన్సిల్స్ ఆపరేషన్ వికటించి ఆర్మీ జవాన్ మృతి చెందాడు. మండలంలోని ఐలవరం గ్రామానికి చెందిన గాలి రామలింగయ్య దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు గాలి శ్రీనివాసరావు (43) గత 15 ఏళ్ల క్రితం ఆర్మీలో ఉద్యోగిగా చేరాడు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జెసిఓగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గొంతులో ట్రాన్సిల్స్‌తో ఇబ్బంది పడుతున్న దృష్ట్యా గత 20 రోజుల క్రితం లక్నో సైనిక వైద్యశాలలో ఆపరేషన్ చేయించుకున్నాడు. ఈ క్రమంలో ఆపరేషన్ అనంతరం కుటుంబ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొద్దిసేపు మాట్లాడాడు. అనంతరం కొంత సమయం తర్వాత బెడ్‌పై నుంచి క్రింద పడిపోయి ఉండటాన్ని సహ ఉద్యోగి గుర్తించాడు. దీంతో వైద్యులకు సమాచారం అందించగా పరిశీలించిన అనంతరం ఆపరేషన్ జరిగిన వెంటనే మాట్లాడటం వలన వికటించి ఉంటుందని వైద్యులు తెలిపారు. తిరిగి మరల చికిత్స పొందుతూ కోమాలో ఉన్న శ్రీనివాసరావు గురువారం రాత్రి మృతి చెందాడు. మృతదేహానికి అధికార లాంఛనలతో లక్నో నుంచి బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలం, ఐలవరం గ్రామానికి శనివారం మధ్యాహ్నం తీసుకొచ్చారు. మృతి సమాచారం తెలుసుకున్న పలువురు సైనిక, మాజీ సైనిక ఉద్యోగులు పెద్ద ఎత్తున శ్రీనివాసరావు అంతిమయాత్రలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో లక్నో నుంచి వస్తున్న శ్రీనివాసరావు పార్థివ దేహాన్ని చెరుకుపల్లికి వరకు వెళ్లి స్వాగతం తెలుపుతూ గ్రామానికి వాయిద్యాలతో తరలించారు. శ్రీనివాసరావు మృతి పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈయన మృత దేహానికి రేపల్లె ఆర్‌డీవో రామలక్ష్మి, భట్టిప్రోలు మండల తహశీల్దార్ మేక శ్రీనివాసరావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబానికి సంతాపం, సానుభూతిని తెలియజేశారు. కాగా పలువురు సైనిక సిబ్బందితోపాటు స్థానిక సివిల్ పోలీసులు కవాతు నిర్వహించి అధికార లాంఛనాలతో గ్రామంలో అంతిమయాత్ర కొనసాగించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అంత్యక్రియలకు రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, వేమూరు సీఐ పి.వి.ఆంజనేయులు, కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు పలువురు పోలీసు సిబ్బంది ఉన్నారు.


అంతిమ యాత్రలో పాల్గొన్న పోలీసులు

ఆర్మీ జవాన్‌కు నక్కా వెంకటేశ్వరరావు నివాళులు

మండలంలోని ఐలవరం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ గాలి శ్రీనివాసరావు పార్థివ దేహానికి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పూలమాలవేసి నివాళులర్పించారు. శ్రీనివాస రావుతో తనకున్న అనుబంధంతో మృతి సమాచారం తెలుసుకొని నివాళులర్పించిన అనంతరం కుటుంబాన్ని ఓదార్చారు. ఈయన వెంట పలువురు ఉపాధ్యాయులు అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-కంభం రూరల్

రైలు నుంచి జారిపడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన కంభం రైల్వే స్టేషన్ సమీపంలోని మార్కాపురం రహదారిలో గేట్ వద్ద చోటుచేసుకుంది. గుంటూరు-డోన్ రైలులో ప్రయాణిస్తున్న ప్రకాష్ (62) అనే వృద్ధుడు శనివారం తెల్లవారుజామున రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడు గుంటూరు వైద్యం నిమిత్తం వెళ్లి వస్తున్నట్లు ఓపీ చీటీ ద్వారా తెలుస్తోంది. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.


పట్టుబడిన కొండచిలువ

మేదరమెట్లలో కొండచిలువ కలకలం

ప్రజాశక్తి -మేదరమెట్ల

మేదరమెట్ల పైలాన్ సమీపంలో 12 అడుగుల భారీ కొండచిలువ హల్‌చల్ చేసింది. వెంటనే స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో స్నేక్ క్యాచర్ చేరుకుని కొండచిలువను చాకచక్యంగా పట్టుకున్నారు. ఘటనా స్థలాన్ని మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ పరిశీలించారు.

28న సామగ్రి వేలం

ప్రజాశక్తి-పొన్నలూరు

పొన్నలూరు ప్రాథమిక వైద్యశాలలో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ సామగ్రి, ఇతర పరికరాలను ఈనెల 28వ తేదీ వేలం వేయనున్నట్లు ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ ఎ.రవి కిరణ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనేవారు ముందుగా రూ.500 చెల్లించాలన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌డీవో

పాఠశాలలో ఆర్‌డీవో తనిఖీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

మూలగుంటపాడు హైస్కూలలో శనివారం ఆర్‌డీవో ప్రసన్న లక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ప్రత్యేకంగా బాలికలతో మాట్లాడి పాఠశాలల్లో విద్యార్థినిలకు ఎదురవుతున్న ఇబ్బందులు గురించి తెలుసుకున్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.రవి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు హరే రామ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యం పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి-వేమూరు

కిశోర బాలికల భద్రత ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని జి.విజయలక్ష్మి సూచించారు. మండల కేంద్రం చుండూరులో కిశోర వికాసంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం, భద్రతతో పాటు అక్రమ రవాణా, హక్కులు, పౌష్టికాహారం వంటి కుల అంశాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండి ఎప్పటికప్పుడు బాలికల పరిరక్షణకు తల్లిదండ్రులతో పాటు సమాజం కూడా చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసిడిపిఓ విజయ రణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగరాజకుమారి, శకుంతల, ఎంపీడీవో కుమారస్వామి, హెల్త్ ఎడ్యుకేటర్ కోటేశ్వరరావు, దుండిపాలెం హెచ్‌ఎం పూర్ణచందర్రావు, ఏపిఎం, హెచ్‌వి, అన్ని గ్రామాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-వేటపాలెం

విలువలకు కట్టుబడి ఉన్న పత్రిక 'ప్రజాశక్తి' అని ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో వెలుగు కార్యాలయంలో ప్రజాశక్తి 2025 నూతన క్యాలెండర్‌ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పది రోజుల ముందే ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించి ప్రజలను నూతన సంవత్సరంలోకి తీసుకెళ్లారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ పి.పార్వతి, ఏపిఎం కె.అంజిబాబు, ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు దోగుపర్తి బాలకృష్ణ, పోతురాజు, ఉమ్మిటి శంకర్రావు, పేరిచెట్ల బాలచంద్ర, పులి వెంకటేశ్వర్లు, జంగిలి వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో నేత్రదానం

ప్రజాశక్తి-అద్దంకి



సూర్యారావు(ఫైల్)

అద్దంకిలో వూడత్తు సూర్యారావు (54) మృతి చెందగా కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. శనివారం రోటరీ కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ వైద్యులు వచ్చి మృతుని కర్నియా సేకరించారు. నేత్రదానం చేసి రెండు జీవితాలకు దృష్టి ప్రసాదించిన మృతుని కుటుంబసభ్యులను, నేత్రదానానికి ప్రోత్సహించిన మురళీ సుధాకరరావును రోటరీ అధ్యక్షులు వీరయ్య అభినందించారు. ఇది రోటరీ ఆధ్వర్యంలో జరిగిన 212వ నేత్రదానం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, ఎజి షేక్ మహమ్మద్ రఫీ, పూర్వ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు, అంజాద్ బాషా, రాచమల్లు శివ పాల్గొన్నారు.



మురళీధర రావును అభినందిస్తున్న శివ ప్రసాద్

మురళీధరరావుకు అభినందనలు

ప్రజాశక్తి - రేపల్లె

కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా టిడిపి రాష్ట్ర కార్యదర్శి పంతాని మురళీధరరావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఆయకట్టు చివరి భూమికి సాగునీరు అందించడమే లక్ష్యంగా విధులు సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలనలో నీటి సంఘాలు పునరుజ్జీవం పోసుకుంటున్నాయని అన్నారు. వ్యవసాయ రంగానికి నీటి సంఘాల అధ్యక్ష పదవులు చాలా కీలకం అని, బాధ్యతాయుతంగా రైతుల సంక్షేమం కోసం పనిచేస్తానని చెప్పారు. ఈ మేరకు నూతనంగా ఎంపికైన పంతాని మురళీధర్ రావుకు, బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారధి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు, ప్రత్తిపాడు శాసనసభ్యులు బి.రామాంజినేయులు, రెవెన్యూ శాఖ మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు కొలసాని రాము, వై.ధర్మతేజ శుభాకాంక్షలు తెలిపారు.

ఛార్జీల పెంపునకు నిరసనగా

విద్యుత్ బిల్లులు దహనం

ప్రజాశక్తి-భట్టిప్రోలు



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో శనివారం భట్టిప్రోలులో బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పి.మనోజ్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచమని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలిపారు. పెంచిన రూ.15,486 కోట్ల సర్దుబాటు చార్జీల భారాన్ని వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డిసెంబర్ నెల బిల్లులో రూ.6072 కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపారని, జనవరి నెల నుంచి మరో రూ.9,414 కోట్ల భారాన్ని ప్రజలపై మోపనున్నారని అన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచినపుడు బాదుడే బాదుడు అని చెప్పిన వారు ఇప్పుడు చేస్తున్నది ఏమిటని మనోజ్ ప్రశ్నించారు. కార్పొరేట్ లాభాల కోసం విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయడం తగదన్నారు. విద్యుత్ చార్జీలు పెరగడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ చార్జీలు చాలవన్నట్లు స్మార్ట్ మీటర్ల పేరుతో మరో భారాన్ని ప్రజలపై వేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. 25 సంవత్సరాలు పాటు లక్ష కోట్ల రూపాయలకు పైగా ప్రజలపై భారం వేసేలా ఆదానీతో గత ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని కుదుర్చుకుందని, ఆ ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రజలపై వేసిన విద్యుత్తు భారాల ఒప్పందాన్ని రద్దు చేస్తారా? లేదా ఒప్పందాన్ని కొనసాగిస్తూ అదానీ పక్షాన ఉంటారో కూటమి ప్రభుత్వం తేల్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.సుధాకర్, ఎం.సత్యనారాయణ, బి.నాగమల్లేశ్వర రావు, ఏ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలి

ప్రజాశక్తి-అద్దంకి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

అద్దంకి పురపాలకశాఖలో రోజువారీ కూలీలుగా పనిచేస్తున్న కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని తెలియజేస్తూ అద్దంకి పురపాల శాఖ కమిషనర్ రవీంద్ర బాబుకి అర్జీ అందజేశారు. అద్దంకి పురపాలకశాఖలో శానిటేషన్ వర్కర్లుగా 24 మంది, ఇంజనీరింగ్ విభాగంలో వర్కర్లుగా 12 మంది రోజువారీ వేతనంపై పని చేస్తున్నారు. వీరికి గత రెండు నెలలు అక్టోబర్, నవంబర్ నెలల వేతనాలు ఇప్పటివరకు ఇవ్వలేదని, క్రిస్మస్, సంక్రాంతి పండగల నేపథ్యంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి వెంటనే వేతనాలు మంజూరు చేయాలని ప్రజాసంఘాల తరఫున వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ విషయమై మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కూడా అర్జీ అందజేశామని, పరిశీలించి వెంటనే వేతనాలు మంజూరు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, కార్మికులు రాఘవయ్య, కోటేశ్వరరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడిగా

వంగరు భాను ప్రసాద్

ప్రజాశక్తి-చెరుకుపల్లి



జగన్‌తో భాను ప్రసాద్

వైసిపి చేనేత విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా చెరుకుపల్లి మండలానికి చెందిన వంగరు భాను ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. చెరుకుపల్లి మండలం గుల్లపల్లి గ్రామానికి చెందిన భాను ప్రసాద్ మొదటి నుంచి వైసిపిలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. తన నియామకానికి కృషి చేసిన నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్తలు డాక్టర్ గణేష్, వరికూటి అశోక్ బాబు, ఎంపిపి రత్న ప్రసాద్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపాడు. రానున్న కాలంలో పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని భాను ప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు.



డిక్షనరీలు అందజేస్తున్న దాతలు

డిక్షనరీలు పంపిణీ

ప్రజాశక్తి-ఇంకొల్లు

గంగవరంలోని శ్రీ వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేశారు. గుంటూరు జిల్లా, అంకిరెడ్డిపాలెంకు చెందిన శ్యామల రఘురామిరెడ్డి వారి తల్లిదండ్రులు కీ.శే. శ్యామల సుబ్బారెడ్డి, నాగరత్నమ్మల జ్ఞాపకార్థం ఈ డిక్షనరీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నార్నె సమత, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కరి కమలేశ్వరరావు, అంకిరెడ్డిపాలెం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు దేవగిరి వీరగంగాధరరెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, కుర్రి పుల్లారెడ్డి, గంగవరం గ్రామస్తులు ఆరె అంకిరెడ్డి, చామల వీరాస్వామి రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో ఐకమత్యం

పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-రేపల్లె

గ్రామాల్లో క్రీడాపోటీలతో ప్రజల మధ్య ఐకమత్యం పెరుగుతుందని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్, భారత ప్రజాతంత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. నిత్యం పోరాటాలు నిర్వహించే ప్రజాసంఘాలుగా ప్రజలకు అన్ని సందర్భాల్లో అందుబాటులో ఉంటామని యువత చెడు మార్గాలు కాకుండా విద్యను ఉపయోగించుకుని అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలన్నారు. ముగ్గులు, రన్నింగ్ లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, స్లో సైకిలింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సూర్య ప్రకాష్, వై.నవీన్, డివైఎఫ్ఐ నాయకులు కె.వి.లక్ష్మణరావు, సిఐటియు నాయకులు కె.ఝాన్సీ, జె.ధర్మరాజు, కె.ఆశీర్వాదం, యుటిఎఫ్ నాయకులు కె.కృపారావు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పాలేరు-బిట్రగుంట సప్లయి ఛానల్

ఎన్నికలు ఏకగ్రీవం

చైర్మన్‌గా గాంధీ చౌదరి, వైస్‌చైర్మన్‌గా మురళి ఎన్నిక

ప్రజాశక్తి-శింగరాయకొండ



దామచర్ల పూర్ణచంద్రరావును సన్మానిస్తున్న చైర్మన్ గాంధీచౌదరి

పాలేరు బిట్రగుంట సప్లయి ఛానల్ చైర్మన్‌గా మందలపు గాంధీచౌదరి, వైస్‌చైర్మన్‌గా బాయిరెడ్డి వెంకట మురళీధర్ రావును ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. శింగరాయకొండ ప్రభుత్వ పాఠశాలలో శనివారం పాలేరు బిట్రగుంట సప్లై ఛానల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎంపిక జరిగింది. ఒంగోలు ఆర్‌డిఓ కె.ప్రసన్న లక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లను ఎన్నుకున్నారు. ఆర్‌డిఓ చైర్మన్ మందలపు గాంధీచౌదరి, వైస్‌చైర్మన్ మురళీలకు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.రవి, ఇరిగేషన్ ఇఇ శివ రామప్రసాద్, ఏఇ రవికుమార్, పాలేరు, బిట్రగుంట సప్లయి ఛానల్ కమిటీ సభ్యులు బత్తుల రాజగోపాల్ రెడ్డి, పూడి రోశిరెడ్డి, చిమ్మిరి సురేష్‌బాబు హాజరయ్యారు. పాలేరు, బిట్రగుంట ఛానల్ చైర్మన్‌గా ఎంపికైన మందలపు గాంధీ చౌదరి గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కూడా ఈ ఛానల్‌కు చైర్మన్‌గా చేసి ఉన్నారు. ప్రస్తుతం ఆయనే మరోసారి చైర్మన్‌గా ఎంపికవటం జరిగింది. మందలపు గాంధీ చౌదరి, బాయిరెడ్డి మురళి తెలుగుదేశం పార్టీ నాయకులు సన్నబోయిన శ్రీనివాసులునాయుడు, చిగురుపాటి శేషగిరి, ఇమ్మడిశెట్టి రామారావు, సుదర్శి ప్రసాదరావు, గనిపనేని రవిచౌదరి, పులి వెంకటేష్, నన్రా రాంబాబు, యర్ర కిరణ్, మేకల అంకమ్మరావు, చల్లా శ్రీనివాసరావు తదితరులు శాలువాతో ఘనంగా సత్కారం చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావుని కలిసి మందలపు గాంధీచౌదరి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. పాలేరు, బిట్రగుంట ఛానల్ చైర్మన్‌గా ఎంపిక అయినందుకు చాలా ఆనందంగా ఉందని, రైతులకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామికి, మారి టైం బోర్డు దామచర్ల సత్యనారాయణ (సత్య)కు మండలపు గాంధీ చౌదరి కతజ్ఞతలు తెలిపారు.



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

'క్లీన్ ప్రకాశం'లో మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలంలోని సూరారెడ్డిపాలెంలో 'క్లీన్ ప్రకాశం-గ్రీన్ ప్రకాశం' కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. గ్రామంలోని ఎస్‌సి కాలనీలో పారిశుధ్య పనులు, సైడ్ కాలువలను మంత్రి స్వామి పరిశీలించారు. వైసీపీ పాలనలో పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్‌కు కూడా నిధులివ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వ 6 నెలల పాలనలోనే గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందిస్తామని తెలిపారు. క్లీన్ ప్రకాశం, గ్రీన్ ప్రకాశం కార్యక్రమంలో జిల్లా ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు.



కేక్ కట్ చేస్తున్న ఉపాస్ డైరెక్టర్లు, డాక్టర్లు

'ఉపాస్'లో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు

నగరంలోని ఉపాస్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్‌చావల, డాక్టర్ కాప అనిల్‌కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు, హాస్పిటల్ కన్సల్టెంట్ డాక్టర్స్ రాంబాబు, పోకూరి శ్రీనివాసరావు, డాక్టర్ కె.సువర్ణ రాజు, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ లీనా పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థినులు

'శ్రీసాయి చైతన్య'లో..

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలోని శ్రీ సాయి చైతన్య హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ పాఠశాల సెక్రటరీ అండ్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్, కరెస్పాండెంట్ ఎం.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. అనంతరం విద్యార్థులు యేసుక్రీస్తు జన్మదిన నాటిక అద్భుతంగా ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాస్టర్ పి.అమృతతేజ్ పాల్గొన్నారు.



వంటకాలు రుచి చూస్తున్న అతిథులు

'వాసవీ'లో మెగా ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ కె.రంగయ్య ఆధ్వర్యంలో మెగా ఫుడ్ ఫెస్టివల్ శనివారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఓ-2 కె.శర్వాణి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ వక్కలగడ్డ రాధిక మల్లికార్జున, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధినేత గోళ్ల వరలక్ష్మి, వినోద్ హాస్పటల్ అధినేత వింధ్యా వైష్ణవి, డాక్టర్ షుష్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. జిల్లావ్యాప్తంగా చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలలో భాగంగా శనివారం కలెక్టర్ కార్యాలయంలో చేపట్టిన పరిసరాల శుభ్రతా కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, కలెక్టరేట్, నగరపాలక సిబ్బంది పాల్గొని చెత్తాచెదారాన్ని తొలగించారు. పిచ్చిమొక్కలను పీకి.. చీపురుతో కలెక్టరు ఊడ్చారు. జాయింట్ కలెక్టర్ కొడవలితో కలుపు తీసి చెత్తను ఎత్తి మున్సిపల్ ట్రాక్టరులో వేసి సిబ్బందిలో స్ఫూర్తిని నింపారు. కార్యక్రమంలో డి.ఆర్.ఓ. బి.చినఓబులేసు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓఎంసీలో..

ఒంగోలు సబర్బన్ : ప్రతి నెల మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కే వెంకటేశ్వరరావు తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, వివిధ సెక్షన్ల అధికారులు కార్పొరేషన్ కార్యాలయంలోని పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ ఎన్ పిచ్చయ్య, వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరు: కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం నాడు టంగుటూరు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు.



పరిసరాల శుభ్రతా కార్యక్రమంలో కలెక్టర్, జేసీ

పారిశుధ్య ఏర్పాట్లను పరిశీలించి, పారిశుధ్య కార్మికులు, ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణ విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఓ వెంకట నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు, టంగుటూరు తహశీల్దార్ జి.ఆంజనేయులు, ఎంపిడిఓ ఆర్ దేవసేన కుమారి, టంగుటూరు సర్పంచి మద్దిరాల మమత, మాజీ సర్పంచి బెల్లం జయంతిబాబు, మద్దిరాల వెంకటరావు, సచివాలయ కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.

వారం రోజుల్లో విధుల్లోకి తీసుకుంటాం..

- ఓఎంసీ హెల్త్ ఆఫీసర్ మనోహర్ రెడ్డి హామీ - తాత్కాలికంగా రిలే దీక్షల విరమణ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు కార్పొరేషన్ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రీల సమ స్యలను పరిష్కరిస్తామని కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్పొరేషన్‌లో తొలగించిన మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం ఐదో రోజుకు చేరాయి. ఐదో రోజు దీక్షలను సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు ప్రారంభించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సిఐటియు అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. కార్పొరేషన్ పారిశుద్ధ్య విభాగం అధికారుల తో యూనియన్ నాయకులు చర్చలు జరిపారు. చర్చల అనంతరం దీక్షా శిబిరం వద్దకు హెల్త్ ఆఫీసర్ మనోహర్ రెడ్డి, శానిటరీ సూపర్వైజర్ ఎన్ పిచ్చయ్య వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేస్త్రీలను సూపర్వైజర్లుగా విధుల్లోకి తీసుకునే విషయం పరిశీలిస్తున్నామని, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో చర్చించి వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్మికులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సమస్య పరిష్కారానికి లిఖితపూర్వకంగా రాసి ఇస్తామని భరోసా ఇచ్చారు. కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. కార్మికులకు



దీక్ష విరమింపజేస్తున్న అధికారులు

రావాల్సిన మూడు నెలలు వేతనం చెల్లించే విషయం కూడా పరిశీలిస్తామని చెప్పారు. దీక్ష చేస్తున్న కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపచేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారుల హామీ మేరకు ఆందోళన కార్యక్రమాలను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్, యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, నాయకులు కే సామ్రాజ్యం, యూనియన్ నగర కార్యదర్శి టి విజయమ్మ, ఆర్ రాములు, ఎం బాబు, ఏ రవి, ఆర్ శ్రీనివాసరావు, కే వెంకటేశ్వర్లు, బి సుబ్బారావు, కుమారి, జాలమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యేలు అన్నా, జంకె

ప్రజాశక్తి-మార్కాపురం

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి నేతలు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం హామీల అమలులో, పాలనలో పూర్తిగా వైఫల్యం చెందిందని వైసిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబుతో పాటు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎపిఐఐసి చైర్మన్ జంకె వెంకటరెడ్డి ఆరోపించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో, తూర్పువీధిలో వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమానికి ఆ పార్టీ పట్టణ కన్వీనర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ అధ్యక్షత వహించారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, కౌన్సిలర్లు, ఎంపిపి బండి లక్ష్మిదేవి



తర్లుపాడులో కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు



మార్కాపురంలో అన్నాకు కేక్ తినిపిస్తున్న జంకె

క్రిష్ణారెడ్డి, జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడు బస్టాండ్ సెంటర్‌లో వైఎస్.జగన్ జన్మదిన వేడుకలు ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి, రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తర్లుపాడు సర్పంచ్ పల్లెపోగు వరాలు, తాడివారి పల్లి సర్పంచ్ జాన్రత్నం, మండల కో ఆప్షన్ అక్బర్ అలీ, మండల వైకాపా నాయకులు ఎక్కంటి రామిరెడ్డి, తాటికొండ దాసయ్య, దుర్భేసుల కాశయ్య, దేవిరెడ్డి రమేష్ రెడ్డి, మంద కొండారెడ్డి, శివారెడ్డి, రేగుల అంకయ్య పాల్గొన్నారు.

ఏపీ పీటీడీ ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ఎన్నికైన నాయకులు

ఏపీ పిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పెళ్లూరి శ్రీనివాసరావు, దాసరి మల్లికార్జునరావు, కోశాధికారిగా పి.బ్రహ్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ పిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పదో మహాసభలు ఒంగోలు సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగాయి. ఈ సందర్భంగా 24 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 14 మందితో కొత్త ఆఫీస్ బ్యారర్స్, పది మందితో కమిటీ ఎన్నికయ్యారు. ఐదు డిపోల నుండి అధ్యక్ష, కార్యదర్శులు కమిటీలో మొత్తం 24 మందితో కొత్త ప్రకాశం జిల్లా కమిటీగా ఏర్పడింది. గౌరవాధ్యక్షులుగా గంటెనపల్లి శ్రీనివాసులు, అధ్యక్ష, కార్యదర్శులుగా పెళ్లూరి శ్రీనివాసరావు, దాసరి మల్లికార్జునరావు, ప్రచార కార్యదర్శిగా షేక్ మీరావలి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ పీరవళి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొన్ని తీర్మానాలు మహాసభ ఆమోదించింది. జెండా ఆవిష్కరణతో మహాసభ ప్రారంభమైంది. మహాసభ జయప్రదానికి బివి.రావు, హరిబాబు, జగన్, పార్వతి, సీతా మహాలక్ష్మి, యస్.రవి, రమణయ్య తదితరులు నాయకత్వం వహించారు. ఎన్నికల పరిశీలకులుగా గంటెనపల్లి శ్రీనివాసులు, యం.అయ్యపరెడ్డి వ్యవహరించారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు

తహశీల్దార్ చిరంజీవి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



మాట్లాడుతున్న తహశీల్దార్ చిరంజీవి

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు మార్కాపురం తహశీల్దార్ కె.చిరంజీవి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తిప్పాపాలెం గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ ఈ రెవెన్యూ సదస్సులు వచ్చేనెల 10 వరకు జరగనున్నాయన్నారు. కార్యక్రమంలో ఉప తహసిల్దార్ బి శ్రీనివాసులు, లక్ష్మీ చెన్నకేశవ దేవస్థానం ఈవో గోలమారి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ ప్రయోగశాలల పెంపుపై ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశంలో జాతీయ ఫోరెన్సిక్ మౌలిక సదుపాయాల మెరుగుదల పథకం, కొత్త నేర చట్టాల, ప్రయోగశాలలు, ఖాళీలు, పరిష్కరించవలసిన విషయాలపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర రక్షణ శాఖ సహాయక మంత్రి, బండి సంజయ్‌కుమార్ సమాధానమిచ్చారు. పౌర వివాదాల పరిష్కారానికి నేర ప్రయోగశాలలలో శాస్త్రవేత్తలు నేర దశ్యాలు, అనుమానితులు బాధితుల నుండి సేకరించిన సాక్ష్యాలను విశ్లేషిస్తారన్నారు. కేసుల వేగవంత పరిష్కారానికి, కొత్త ప్రయోగశాలలు, యంత్రాలు, పరికరాలు, పరిశోధన సౌకర్యాలు, సిబ్బంది, ప్రాజెక్టులు ఏర్పాటుకు రక్షణ శాఖ నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 సెక్షన్ పరిధిలో ఏపీ ట్రాన్స్‌కో వారి 132 కెవి ఒంగోలు - ఇంకొల్లు ఓవర్ హెడ్‌లైన్ తొలగించే వర్క్ సందర్భంగా ఆదివారం ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు కర్నూలురోడ్డు, ఎన్‌జిఓ కాలనీ, చంద్రయ్యనగర్, పాల బజార్, జయప్రకాష్ కాలనీ, నాగేంద్రనగర్, వేంకటేశ్వర కాలనీ, ఉడ్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతుల కారణం వల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి.పాండురంగారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సొంత ఊరిపై మమకారంతో అభివృద్ధి

రూ.1.50 కోట్లకు పైగా సొంత నిధులతో పనులు

ప్రజాశక్తి - సిఎస్ పురం

సొంత ఊరిపై మమకారంతో తండ్రి స్ఫూర్తితో పుట్టి పెరిగిన గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే తలంపుతో రూ.1.50కోట్లకుపైగా సొంత నిధులు వెచ్చించి గుంటిమడుగు శ్రీనివాస్‌వర్మ గ్రామ అభివృద్ధి చేశారు. మండలంలోని చింతపూడు గ్రామానికి చెందిన బెంగుళూరులో స్థిరపడిన వ్యాపారవేత్త శ్రీనివాస్‌వర్మ సొంత గ్రామమైన చింతపూడును అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేశారు. గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి సొంత నిధులు వెచ్చించి కృషి చేస్తున్నారు. ఎలాంటి రాజకీయ పదవి ఆశించకుండా తన గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వర్మను పలువురు అభినందిస్తున్నారు. తన తండ్రి వెంకటరామరాజు మరణానంతరం జివిఆర్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ఆయన ఆశయాలకు అనుగుణంగా చింతపూడు పంచాయతీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.



ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన హాస్టల్ నిర్మాణ దాత శ్రీనివాసవర్మ

పేద విద్యార్థులను ఆదుకునేందుకు సి నాగులవరం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో రూ.70లక్షలకుపైగా వెచ్చించి బిసి బాలుర వసతి గృహాన్ని నిర్మించారు. చుట్టుపక్కల గ్రామాల పాఠశాలలో చదివే విద్యార్థులు కోసం దాదాపు 20ఏళ్లుగా పుస్తకాలు, బ్యాగులతో పాటు పాఠశాలలకు, విద్యాసామగ్రిని అందించేందుకు రూ.40 లక్షలకు పైగా ఖర్చు చేశారు. మరో రూ.40లక్షలకుపైగా తన సొంత నిధులతో వాటర్ ప్లాంట్, సిసి రోడ్లు, ఎస్సీ కాలనీలో ఇంటింటికీ కులాయి, బస్‌షెల్టర్, డ్రైనేజీలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఎలాంటి స్వార్థం లేకుండా రూ.కోట్ల నిధులు వెచ్చించి గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే తలంపుతో జివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నారు. బీసీ బాలురవసతి గృహం పూర్తి చేసి అన్ని సౌకర్యాలు కల్పించి నేడు ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు.

నేడు బీసీ బాలుర వసతిగృహం ప్రారంభం

మండలంలోని చింతపూడు పంచాయతీలోని సి నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన బీసీ బాలుర వసతి గృహాన్ని ఆదివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, కనిగిరి శాసన సభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతులు మీదుగా ప్రారంభించనున్నట్లు జివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత జి శ్రీనివాస్‌వర్మ తెలిపారు.



దుస్తులు అందచేస్తున్న ఎంపిడిఓ, టిడిపి నేత శ్రీనివాసరెడ్డి

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-తాళ్లూరు

సెమీ క్రిస్మస్ వేడుకలలో భాగంగా శనివారం తాళ్లూరు గ్రామ పంచాయతీలో క్లాప్ మిత్రలు, పంచాయతీ సిబ్బందికి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి తరుపున టిడిపి సీనియర్ నాయకులు ఇడమకంటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో క్రిస్మస్ కానుకగా నూతన వస్త్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె సుందర రామయ్య, సర్పంచ్ చార్లెస్ సర్జన్, పంచాయతీ సెక్రటరీ ఐవి రమణారెడ్డి, టిడిపి గ్రామ అధ్యక్షులు మారం వెంకా రెడ్డి, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాళ్లూరు : ప్రేమ, దయ కలిగిన యేసు క్రీస్తు బోధనలు ఎప్పటికీ ఆదర్శమని జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్టమస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సిహెచ్ భారతి, అంగన్ వాడి సూపర్‌వైజర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.



ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని చందలూరు హైస్కూల్‌లోని విద్యార్థులకు బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రధాన ఉపాధ్యాయులు గురుప్రసాద్ ఆల్‌ఇన్ వన్ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, టెన్త్ క్లాస్ ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ పి సంధ్యారాణి

వాతావరణ మార్పుల నుండి పంటలు కాపాడుకోవాలి

ప్రజాశక్తి-దర్శి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, వాతారణంలో వస్తున్న మార్పులన బట్టి పంటల యాజమాన్యం చేపట్టాలని దర్శి వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ సంధ్యారాణి వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజమాన్యం, పోషఖ సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రకాశం జిల్లా వ్యవసాయ అధికారి ప్రతినిధి రామమోహన్ మాట్లాడుతూ ప్రతి రైతుసేవా కంద్రంలో వ్యవసాయ సహాయ, సహకారాలు, రబి పంటలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటలు కాపాడుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం పోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్, వ్యవసాయ పరిధిశోదన స్థానం, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భైరవకోనలో ఏసీబీ డీఎస్పీ పూజలు

ప్రజాశక్తి - సిఎస్ పురం

ప్రముఖ శైవ క్షేత్రమైన భైరవకోనలో గుంటూరు ఎసిబి డిఎస్పి టివి ప్రతాప్‌కుమార్, సిట్ సిఐ జి శ్రీధర్ కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. ముందుగా జలపాతాన్ని వీక్షించారు. అనంతరం త్రిముఖ దుర్గా అమ్మవారిని, కాలభైరవ స్వామిని, శివలింగాలను దర్శించుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి డి వంశీ కృష్ణారెడ్డి, ముప్పాళ్ళ శ్యాంసుందర్‌రాజు సూచనల మేరకు ఆలయ అర్చకులు వారికి అభిషేకం పూజలు కుంకుమార్చన చేసి దేవస్థానం శేష వస్త్రాలతో సన్మానించారు.



భైరవకోనలో పూజలు చేస్తున్న అధికారులు

స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



వెంకాయమ్మను సత్కరిస్తున్న ఆళ్ల శ్రీకాంత్‌రెడ్డి

బూచేపల్లిని కలిసిన ఆళ్ల

ప్రజాశక్తి-దర్శి

దొనకొండ మాజీ జడ్‌పిటిసికి వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులుగా ఆళ్లశ్రీకాంత్‌రెడ్డి, దర్శికి చెందిన ఎస్సీ విభాగం అధ్యక్షులుగా గాలి మూటి దేవప్రసాద్ 2వ సారి నియమితులైన సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మలను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ సీనియర్ నాయకులు, తాళ్లూరు మాజీ ఎంపిపి పోశం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

ప్రజాశక్తి - హనుమంతునిపాడు

మన చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నట్లయితే మన ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని ఎంపిడిఒ రంగ సుబ్బరాయుడు అన్నారు. క్లీన్ ప్రకాశం, గ్రీన్ ప్రకాశం నినాదంతో మెగా శానిటేషన్ డ్రైవ్ మండల అభివృద్ధి కార్యాలయం ఆవరణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో మన చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే దోమల వలన వచ్చే రోగాల బారిన పడకుండా ఉంటామని చెప్పారు. నీటిని నిల్వ ఉంచకుండా వాటర్ ట్యాంకులను శుభ్రం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గోన రమేష్, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎస్ పురం : గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటున్నట్లు అంబవరం పంచాయతీ సర్పంచ్ కొండూరు కొండయ్య తెలిపారు.



చెట్ల పాదులను శుభ్రపరుస్తున్న ఎంపిడిఒ సుబ్బరాయుడు

గ్రామంలో మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వ్యాపించకుండా ఉండేందుకు శానిటేషన్ చేయించారు. పంచాయతీలో అన్ని వీధుల్లో బ్లీచింగ్ చల్లి శుభ్రం చేయించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుండటం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య, మాజీ సర్పంచ్ వెంకటరామరాజు, ఆర్ రాజేంద్ర, ఎం రాజేంద్రవర్మ, ఎం నాగేష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన 'మానవత' సభ్యులు

ప్రజాశక్తి-దర్శి

వరల్డ్ మెడిటేషన్ డే సందర్భంగా శనివారం కట్టుబడిపాలెం పాఠశాల ఆవరణలో దర్శి మానవత సేవా సంస్థ ప్రతినిధులు 30 మొక్కలు నాటారు. మొక్కలను దేవత వరప్రసాద్ అందజేశారు. కార్యక్రమంనకు చైర్మన్ దేవత ప్రసాద్, పోతవరం హైస్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఎంపీపీఎస్ పోతవరం స్కూల్ ప్రధానోపాధ్యాయులు, సంస్థ అధ్యక్షులు డి వెంకట్‌రెడ్డి, సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపియుపిఎస్ శేషంవారిపాలెం ప్రధానోపాధ్యాయులు ఎం నాగేశ్వరరావు, ఎంపిపిఎస్ కట్టుబడివారిపాలెం (ఎస్సీ) ప్రనధానోపాధ్యాయులు మస్తాన్‌వలి పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మానవతా సంస్థ సభ్యులు

ఉగ్ర ఆశయాలను నెరవేర్చడమే అందరి బాధ్యత

టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్

ప్రజాశక్తి - పామూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, శాసన సభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆశయాలను నెరవేర్చడమే తమ బాధ్యతని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్ అన్నారు. మోపాడు రిజర్వాయర్ చైర్మన్ చుంచు కొండయ్యను శనివారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరిని నాయకులు గుర్తుపెట్టుకుంటారని అన్నారు. ఈ విధానం టిడిపికి మాత్రమే ఉందని అన్నారు. మండలంలోని చెరువుల చైర్మన్లుగా పదవి పొందిన ప్రతి ఒక్కరు చెరువుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రైతులకు అండగా ఉండాలని అన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం రైతుకు అండగా ఉందని



చైర్మన్ కొండయ్యను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

అన్నారు. మోపాడు ఆయకట్టు నూతన చైర్మన్ చుంచు చెంచయ్య, వైస్ చైర్మన్ మోర్బోయిన నరసింహారావుకు కనిగిరి ఆర్డిఓ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడ వెంకటేశ్వర్లు, బొల్లా నరసింహారావు, అడుసుమల్లి ప్రభాకరచౌదరి, ఎం రమణయ్య పాల్గొన్నారు.

నేడు సిమెంట్ రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-సిఎస్ పురం

పట్టణంలో రూ.3కోట్లతో నిర్మించిన సిమెంట్ రోడ్లను కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతులమీదుగా ఆదివారం ప్రారంభించినట్లు టిడిపి మండల అధ్యక్షులు బొమ్మనబోయిన వెంగయ్య తెలిపారు. ఎన్నో ఏళ్లుగా బస్టాండు కూడలితోపాటు ఇతర ప్రధాన రహదారుల్లో గుంటతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు రోడ్ల నిర్మాణంతో కష్టాలు తీరనున్నాయని తెలిపారు. మండలంలోని టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.



పరిసరాలు శుభ్రం చేస్తున్న పోలీసులు

పోలీసుల ఆధ్వర్యంలో స్వచ్ఛ సేవ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ హజ రత్తయ్య ఆధ్వర్యంలో శనివారం సర్కిల్ కార్యాలయంలో స్వచ్ఛ సేవా కార్యక్రమం నిర్వహించారు. సర్కిల్ కార్యాలయం పరిసర ప్రాంతాల మొత్తం శుభ్రం చేయడం జరిగింది. శింగరాయకొండ, జరుగుమల్లి పోలీసులతో పాటు ఎస్ఐ బి.మహేంద్ర పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుపై శిక్షణ

ప్రజాశక్తి-పర్చూరు

ఏడీఏ మోహన రావు అధ్యక్షతన సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాల ఆర్ఎస్‌కె సిబ్బందికి ఈ-పంట బుకింగ్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మోహనరావు మాట్లాడుతూ రబీ సీజన్లో రైతులు సాగు చేసిన ప్రతి పంటని ఈ-పంటలో నమోదు చేయుంచుకోవాలని చెప్పారు. నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం అందించే, పంట నష్ట పరిహారం, పంట కొనుగోళ్లు, పంట రుణాలు, అన్నదాత సుఖీభవ పథకాలు వస్తాయని చెప్పారు. ఏవో పర్చూరు రామ్మోహన్ రెడ్డి, ఇంకొల్లు ఏవో వేణు, కారంచేడు ఏవో సుధీర్ బాబు, యద్ధనపూడి ఏవో మేరమ్మ, టెక్నికల్ ఏవో మహేష్ బాబు మాట్లాడారు. పర్చూరు మార్కెట్ యార్డ్‌లోని ల్యాబ్‌లో రైతులకు ఉచితంగా విత్తనాలు పరీక్ష చేస్తామన్నారు. దీనికి రైతులు ఎటువంటి రుసుము కట్టవలసిన అవసరం లేదని తెలిపారు. కౌలు రైతులందరికీ సిసిఆర్ కార్డులు అందించాలన్నారు.

హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి-బల్లికురవ

ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్లు ధరించడం ద్వారా మీ కుటుంబాలకు భరోసా ఇవ్వాలని ఎస్ఐ జీవి చౌదరి అన్నారు. శనివారం మండలంలోని వేమవరం కూడలిలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్లు ధరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాలను కోల్పోవడం ద్వారా అతనిపై ఆధారపడ్డ కుటుంబం అనాథగా మారుతుందన్నారు.

ఘనంగా జగన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం శింగరాయకొండలో ఘనంగా నిర్వహించారు. కందుకూరు రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కేకును కట్ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. అనంతరం వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, సామంతుల రవికుమార్‌రెడ్డి, రాపూరి ప్రభావతి, యనమల మాధవి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ సుల్తాన్, షేక్ లియాకత్, మసనం వెంకటరావు, షేక్ కరీం, పటాన్ రియాజ్, షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు చెరుకుపల్లిలో ఘనంగా నిర్వహించారు. రేపల్లె నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త డాక్టర్ గణేష్ ఆధ్వర్యంలో గుళ్లపల్లిలో భారీ రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేమూరు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమానికి వైఎస్ జగన్ చేసిన సేవలను కొనియాడారు.



రక్తదానం చేస్తున్న వరికూటి అశోక్‌బాబు



మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్

అనంతరం చెరుకుపల్లి మండల వైసీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి మండల పరిషత్ అధ్యక్షులు మత్తి దివాకర రత్న ప్రసాద్, యార్లగడ్డ మదనమోహన్, వైసీపీ లీగల్ సెల్ నాయకులు బోర్ర శ్రీని వాసరావు, వంగారు భాను, కామినేని కోటేశ్వరరావు, లుక్కా బాపనయ్య, దొంతుబోయిన వెంకటేశ్వర రెడ్డి, పాల్గొన్నారు.

చుండూరు: మండలంలోని వలివేరు గ్రామంలో మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాట్ల మోహన్ రెడ్డి, ఎంపీటీసీ, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చుండూరు మండలంలోని అన్ని గ్రామాల్లో జన్మదిన వేడుకలు నిర్వహించారు.

మెదరమెట్ల: మెదరమెట్లలోని వైసీపీ కార్యాలయం వద్ద శనివారం జగన్ పుట్టినరోజును పురస్కరించుకొని కేకును కట్ చేశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వైవి రత్నారెడ్డి, కోయ అంకారావు, పోకూరి హనుమంతరావు, మాజీ సర్పంచులు నాగలక్ష్మి, జజ్జన ఆనందరావులతోపాటు వైసీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పర్చూరు: జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బొమ్మల సెంటర్లోని వైఎస్సార్ విగ్రహానికి నివాలులర్పించి, కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఈ కార్యక్రమంలో భారీగా వైసీపీ అభిమానులు పాల్గొన్నారు.

కళాశాలకు కంప్యూటర్లు అందజేత

ప్రజాశక్తి-బల్లికురవ

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మామిడిపూడి వెంకట రంగయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10 కంప్యూటర్లను శనివారం ఆ సంస్థ కోఆర్డినేటర్ హరిహర రెడ్డి అందజేశారు. ఈ కంప్యూటర్లను ఉపయోగించుకొని విద్యార్థులు ఇంకా ముందుకు వెళ్లాలని వారు అన్నారు. అనంతరం ఆయన కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎర్రయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనిల్ కుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



కంప్యూటర్లు అందజేసిన దాతలు



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆదిత్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

మండల పరిధిలోని వినాయక్రమం ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు నాలెడ్జి అసెస్మెంట్ టెస్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ కోడే కృష్ణ బాబు తెలిపారు. నగరం మండలం పూడివాడ శ్రీ అచ్యుత అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 5, 6 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన నాలెడ్జి అసెస్మెంట్ టెస్ట్‌లో ఆరో తరగతి విభాగంలో పాఠశాల విద్యార్థిని అక్కల భాగ్యశ్రీ ప్రథమ స్థానం, ఐదవ తరగతి విభాగంలో పాఠశాల విద్యార్థిని కేసిరెడ్డి విజయలక్ష్మి ద్వితీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా కొలనుకొండ దుర్గేష్, పైన ఈశ్వర్ ప్రసాద్ రెడ్డిలు ప్రత్యేక బహుమతులు గెలుపొందినట్లు డైరెక్టర్ తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండల స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో శింగరాయకొండలోని స్మార్ట్ జెన్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీలలో విద్యార్థులు తానిష్క మరియు కార్తిష్‌లు అత్యుత్తమ ప్రతిభను కనపరిచి, జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతారాణి తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ లలిత, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం లోని పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముందుగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టి, క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు మంత్రి స్వామి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ యేసుక్రీస్తు జన్మదిన వేడుకలు ప్రపంచ దేశాలలో ఘనంగా జరుపుకుంటారని, ప్రతి ఒక్కరు ఈ క్రిస్టమస్ వేడుకలు ఆనందోత్సహాంతో భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ జి.రామయ్యచౌదరి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అనూష, ఆరోగ్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

రేపల్లె: స్థానిక కళాశాలలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ అంటే ప్రేమ, దయ, కరుణ అన్నారు. ప్రతిఒక్కరి పట్ల ప్రేమ, దయ శాంతిని కలిగి ఉండాలని చెప్పిన జీసస్ బోధనలు అనుసరణీయమన్నారు. దేవుడు ప్రతిఒక్కరికి శక్తినిస్తాడని, మన గురించి కాకుండా సమాజం గురించి కూడా ప్రతి ఒక్కరు ఆలోచించి సరైన మార్గం లో పయనించాలని కోరారు. అనంతరం పాస్టర్ రాజు కేకును కత్తిరించి క్రిస్టమస్ సందేశాన్ని అందించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రిజ్వానా, ఉపాధ్యాయులు రవి, ఎల్ వి ఆర్, వెంకటేశ్వరమ్మ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



క్యాండిల్ వెలిగిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య



మాట్లాడుతున్న మంత్రి స్వామి

పర్చూరు: స్థానిక వెలుగు కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలలో భాగంగా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.పద్మజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యేసు క్రీస్తు ప్రేమ, దయను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలనీ అందరూ సోదరభావంతో కలిసి మెలసి ఉండాలన్నారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రధ్యుమ్న కుమార్, ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మణచారి, ఏపీఎం రామకృష్ణ, ఏపీఎం ఫణి బాబు, స్త్రీనిధి మేనేజర్ కరుణాకర్, సీసీలు విజయ్ కుమార్, శ్రీనివాసమూర్తి, ప్రమీల, నరసింహారావు, అకౌంటెంట్ ఝాన్సీరాణి, వీవోఏలు పాల్గొన్నారు.

వేటపాలెం: తోటి మనుషుల పట్ల ప్రేమ, దయ, కరుణ చూపుటయే ఏసుక్రీస్తు మార్గమని ఆ మార్గంలోనే మన మందరం ప్రయాణించాలని ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళ సమైక్య ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు బోధనలను ఆచరించినప్పుడే సమాజం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే సెమీ క్రిస్మస్ కేకు కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా క్యాండిల్స్ వెలిగించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ పి.పార్వతి, బాపట్ల, చీరాల ఏరియా వెలుగు కోఆర్డినేటర్ ఉసిరిపాటి సుబ్బారావు, ఏపిఎం కె.అంజిబాబు, ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు, సీసీలు కె.చిన్నయ్య, టి.విజయలక్ష్మి, కె.అనురాధ, టిడిపి నాయకులు జె.పోతురాజు, పి.బాలచంద్ర, యు.శంకర్రావు, పల్లపోలు శ్రీనివాసరావు, ఎర్ర నాగ మల్లేశ్వరి, పులి వెంకటేశ్వర్లు, జంగిలి వెంకట రామారావు పాల్గొన్నారు.



చెత్తను తొలగిస్తున్న దృశ్యం

కొండపిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-కొండపి

ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం మండల కార్యాలయం వద్ద కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుధ్య పనులతో గ్రామాలలో శుభ్రత పెరుగుతుందన్నారు. దీంతో గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయన్నారు. అలాగే కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులో ఉన్న రోడ్డు వెంబడి ఉన్న చెత్తను తొలగించి పంచాయతీ కార్యదర్శి బిళ్ల అంకయ్య బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

క్రిస్మస్ సందర్భంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి-బాపట్ల

సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో ప్యాడిసన్ పేటలో శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు యువతుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచేందుకు ఈ క్రీడలు నిర్వహించినట్లు సిఐటియు నాయకులు కె.శరత్ తెలిపారు. ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందర్ పాల్గొన్నారు కార్యక్రమంలో సిఐటియు బాపట్ల టౌన్ సెక్రటరీ జె.శామ్యూల్ అధ్యక్షులు ఓ.లక్ష్మణ్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ బాపట్ల అధ్యక్షులు కుమార్, పి.రవిబాబు, మాజీ కౌన్సిలర్లు దేవదాసు, విజయకుమార్, గ్రామస్తులు సుజాత, రత్నం, వేణు పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలందించాలి..

ప్రజాశక్తి-బాపట్ల

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్.విజయమ్మ అన్నారు. శనివారం వెదుళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి వైష్ణవి, బి.మరియమ్మ, హెచ్ ఇ పరమేశ్వరి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

కాంట్రాక్టర్ టీచర్లుగా గుర్తించాలని ధర్నా

ప్రజాశక్తి-బాపట్ల

గిరిజన సంక్షేమ గురుకులాల్లో పదేళ్ల పైబడి ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లుగా మార్పు చేయాలని కోరుతూ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకులాల ఔట్సోర్సింగ్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం బాపట్లలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎన్. పరమేష్ మాట్లాడారు. కార్యక్రమాల్లో డి .రామకష్ణ, సిహెచ్. రవికిరణ్, జి. బ్రహ్మయ్య, ఏ. సురేష్, బి. వీరయ్య, జె. వెంకటేష్, టీ. మస్తాన్ నాయక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, సిఐటియు నాయకులు కే శరత్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో

అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించం

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ధాన్యం కొనుగోలులో రైతులను మిల్లర్లు మోసగించినా, అవకతవకలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని కలెక్టర్ జె.వెంకట మురళి హెచ్చరించారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులతో శనివారం స్థానిక కలెక్టర్ చాంబర్లో ఆయన సమావేశం నిర్వహించారు. ఆరుగాలం శ్రమించిన రైతులను ఆదుకోవాలని, పంటలకు మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ అన్నారు. రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కషి చేస్తుంటే రైస్ మిల్లర్ల తీరు అందుకు భిన్నంగా ఉందన్నారు. పలు రకాల ఆంక్షలతో రైతులను నష్టపర్చాలని చూస్తే సహించేది లేదన్నారు. ధాన్యం కొనుగోలులో రైస్ మిల్లర్లు మోసం చేయరాదన్నారు. అలా చేస్తే రైస్ మిల్లులకు ఉన్న లైసెన్స్ లను రద్దు చేయడానికీ వెనుకాడబోమన్నారు. ధాన్యం లోడింగ్, అన్లోడింగ్ చేసేటప్పుడు వాహనాలు బారులు తీరి ఉండరాదని, ఖాళీగా ఉన్న ఇతర మిల్లులకు వాటిని పంపాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, వ్యవసాయ శాఖ అధికారి రామకష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్యాంసన్, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాస్, బాపట్ల తాలూకా రైస్ మిల్లర్స్ ప్రెసిడెంట్ శివరాం ప్రసాద్, జి డి సి ఎం ఎస్ బిజినెస్ మేనేజర్ డి హరి గోపాలం, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నాణ్యత తప్పనిసరి

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీల పరిష్కారంలో నాణ్యత లేకపోతే అధికారులే బాధ్యులవుతారని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి హెచ్చరించారు. పీజీఆర్ఎస్ పై అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల తహసిల్దార్లతో శనివారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. పునరావతమయ్యే అర్జీలపై ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించిందని కలెక్టర్ చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో పరిష్కరించకపోవడంతోనే అర్జీలు పలుమార్లు పునరావతం అవుతున్నాయన్నారు. వాటిని గుర్తించి అందుకు సంబంధించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. పర్చూరు మండలం ఇంజినీరింగ్ అసిస్టెంట్ పరిధిలోని 88 ఫిర్యాదులకు పరిష్కారం చూపినప్పటికీ అసంతప్తి వ్యక్తం చేయడంపై ఆయన ఆరా తీశారు. అలాగే చీరాల మండలంలోనూ ఇదే పరిస్థితి ఉండడంపై అధికారులను నిలదీశారు. ఈ సమావేశం లో సిపిఓ శ్రీనివాస్, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

మార్కాపురం కేంద్రంగా...

ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలి

- వెలిగొండ ప్రాజెక్టుపై చిత్తశుద్ధి ఏదీ...?
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు 'సైదా'

ప్రజాశక్తి-మార్కాపురం

గత ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు ఎన్నికల్లో నెగ్గిన తరువాత ఆ హామీలను మర్చిపోయారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ధ్వజమెత్తారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబాటులో పశ్చిమ ప్రకాశం ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పాడం జరిగిందన్నారు. మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు అధికారంలోకి రాగానే జరుగుతుందని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ కూడా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. త్వరలో ఈ ప్రాంతంలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి పర్యటిస్తారని, ఆ తరువాత ఉద్యమ కార్యాచరణ ఉంటుందని వివరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మోషె, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ రెహనాబాను, పార్టీ సీనియర్ నాయకులు, మాజీ పిసిసి సభ్యులు తిరుమల శెట్టి రామయ్య, న్యాయవాది షేక్ మతిన్, కొనకనమిట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.ఇమ్మానియేల్, పొదిలి పట్టణ అధ్యక్షులు ముల్లా జిల్లాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్ సైదా

నిధులపై నిశ్శబ్దం

వీక్లీ వ్యూ

కూటమి ప్రభుత్వం వచ్చి ఆరునెలలు దాటుతోంది. పాలనను గాడిలో పెట్టే పనిలో పడ్డామంటూ సిఎం చంద్రబాబు ఇప్పటి వరకూ చెబుతూ వచ్చారు. అవే మాటలు చెబుతూ ఇంకా కాలం గడపడమంటే ఆలోచించాల్సిన విషయం. ఏ పనులకూ నిధుల్లేవనే చర్చ సాగుతోంది. కొత్తగా పనులు ఏమీ చేపట్టడం లేదు. భారీ అవసరాల ప్రాజెక్టులను వదిలేశారు. సాధారణ పాలన సాగుతోంది. సంక్షేమ పథకాలూ ఇంకా పూర్తిగా అమలులోకి రాలేదు. ఎన్నికల మేనిఫెస్టో అమలులోకి రాలేదు. వెంటనే పింఛన్ల పెంపు.. దీపావళి నుంచి గ్యాస్ సిలిండర్లు ఈ రెండు మాత్రమే కనిపిస్తున్నాయి. మిగతా వాటి కోసం ఎదురుచూపులే మిగిలాయి. ఇక జిల్లాలో ఏం జరుగుతుందనేది పరిశీలిస్తే.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మాత్రం ఒక్కటీ ఆచరణలోకి రాలేదు. ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్లు నియోజక వర్గాల్లో భారీగా హామీలిచ్చారు. వాటిపైనా చర్చ లేదు. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని అన్నిచోట్లా పెద్దఎత్తున హామీ ఇచ్చారు.

పశ్చిమప్రాంతంలో ఇదొక కీలక ప్రకటనగా ముందుకు వచ్చింది. ఇపుడు దాని గురించి మాట్లాడేవారేలేరు. మార్కాపురంజిల్లాపై గతంలో వైసిపి చేసిన అన్యాయం ఇప్పటికీకొనసాగుతోంది. సరిదిద్దే యత్నం కనిపించడం లేదు.అధికారంలోకి రాగానే దీన్ని వదిలేశారనే చర్చ సాగుతోంది. వెలుగొండ నిర్వాసితులకు ప్యాకేజీలకు నిధుల్లేవు.వెయ్యి కోట్లకుపైగా అవసరం ఉంది.ప్రాజెక్టును పూర్తిచేయాలంటే ఇంకా రూ. 4వేల కోట్లు అవసరం. ఈ నిధులు ఇపుడు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే పరిస్థితిలో ఉందా?అంటే సంశయనంగానే ఉంది.కనిగిరి, దొనకొండ పారిశ్రామిక వాడలపైనా మళ్లీ చర్చ వినిపించడం లేదు.వీటికీ భారీగా నిధులు కేటాయించాలి. కనీస మౌళిక సదుపాయాలు కల్పించడంతోపాటు పరిశ్ర మలు వచ్చేలా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి.ఆ దిశగా అడుగులు కనిపించడం లేదు.కనిగిరి నియోజకవర్గంలో ఇటీవల రిలయన్స్ సంస్థ బయోఇంధనం ప్లాంటును ఏర్పాటు చేయడానికి ఒప్పందం జరిగింది. ఇంకా సోలార్ పవర్ ప్లాంట్లు ఏమైపోయాయో తెలియదు.గుండ్లకమ్మ ప్రాజె క్టు మరమ్మతులకు భారీగా నిధులు కేటాయించాల్సిఉంది. ఒంగోలు- కర్నూలు రహదారి విస్తరణ ఎండమావిగా మారింది.టోల్‌పద్ధతిలో దీన్ని చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది.ఇక నగరాల్లో ఏ పనులు చేప ట్టడం లేదు. రోడ్ల విస్తరణ, డ్రైన్లు వంటి పనులకు నిధులు ఆటంకంగా మారాయి. పన్నుల రూపంలో వచ్చే డబ్బులు 80శాతం వేతనాలు, పాలనా వ్యయాలకే సరిపోతున్నాయంటున్నారు. గ్రాంటులు వస్తే తప్ప జనం బాగోగులు చూసే పరిస్థితి లేదు.గత ప్రభుత్వం వదిలేసిన టిట్కో ఇళ్లనూ అలాగే ఉంచారు.ఇళ్ల స్థలాలు ముందుకు సాగడంలేదు. ఒంగోలులో రెండు సెంట్లు కలిపి ఇస్తామ న్నారు. ఇది సందిగ్ధంగానే ఉంది. జిల్లా డెయిరీ మూత పడే ఉంది. ఇలా అనేక తెలుగుదేశం ఎన్నికల్లో చక్కదిద్దుతామని ఇచ్చిన హామీలన్నీ అలాగేఉన్నాయి. నిధులు కేటాయింపే పెద్ద సవాలుగా మారింది. మేనిఫెస్టోలో పెట్టిన పథకాలూ నిధుల్లేకనే అమలులోకి రాలేదనే చర్చ ఉంది.

సిపిఎం జిల్లా మహాసభలు చీమకుర్తిలో మూడు రోజులపాటు జరిగాయి. తొలిరోజు బహిరంగసభకు పార్టీ రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరయ్యారు.మహాసభల్లో 32 అంశాలపై తీర్మానాలు చేశారు. జిల్లా అభివృద్ధికి తక్షణం రూ.10వేల కోట్లుకేటాయించాలని, వెలుగొండ ప్రాజెక్టు పనులు చేపట్టి రైతులకు నీటిని విడుదల చేయాలని, విద్యుత్ భారాలు తగ్గించాలని మహాసభ కోరింది. తక్షణ కర్తవ్యాల కింద వీటిని తీసుకుని వీటి సాధన కోసం ఆందోళనలు చేపట్టాలని మహాసభ పిలుపునిచ్చింది.నూతన కార్యవర్గం ఏర్పాటైంది.

రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయి.తాజాగా అద్దంకిలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, టంగుటూరు, కొండపి మండలాల్లో మంత్రి డోలావీరాంజనేయస్వామి ఈసదస్సులకు హాజరయ్యారు.జనం నుంచి అర్జీలు స్వీకరించారు.గ్రామాల్లో అర్జీలు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. వీటి పరిష్కారం చాలా తక్కువగాఉంది. ఇప్పటి వరకూ 10వేలకుపైగానే అర్జీలు రాగా పరిష్కారం 200లోపే ఉన్నాయి.క్షేత్రస్థాయిలో వీటిని పరిశీలించాలి.వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.లేకుంటే ఈ సదస్సుల వల్ల ఉపయోగం ఉండదని రెవెన్యూ యంత్రాంగం గుర్తించాలి.ఏళ్లతరబడి తిరుగుతూనే ఉన్నారు.అనేక రకాల భూవివాదాలు గ్రామాల్లో ఉన్నాయి.మండలస్థాయిలో పరిష్కారం కానందున జిల్లా కలెక్టర్‌కు పలుసార్లు వచ్చి ఇచ్చిన బాధితులు వందల్లో ఉన్నారు.భూ సమస్యలపై నిర్లిప్తత కొనసాగుతోంది.అధికారుల్లోనూ వాటిని పరిష్కరించాలనే ఆలోచన కూడా తక్కువగానే ఉంది.సిఫార్సులు, వత్తిళ్ల ,లంచాలు ఇలా అనేక రకాలుగా ప్రలోభాలు భరిస్తేనే ఎంతో కొంత పనులు అవుతాయి. ఇక రీసర్వే వల్ల కూడా వేలాది సమస్యలు వచ్చాయి.వాటిపైనా అర్జీలు అందాయి.వీటిని కూడా పరిష్కారం చేయాల్సి ఉంది.భూ సమస్యలు పరిష్కారమైతే గ్రామాల్లో సగం సమస్యలు తీరినట్లే

ఈ ఏడాది తుఫానులు,అల్పపీడనాలు జిల్లా రైతులను వణికిస్తున్నాయి.ఇటీవల ఫెంగల్ తుఫాను ముంచిన నష్టాలనుంచి తేరుకోలేదు.మళ్లీ అల్పపీడనాలు కొనసాగుతున్నాయి.వారం రోజులుగా వాతావరణం మబ్బుపట్టింది.పంటలకు చీడలు ఆశించే వాతావరణం ఉంది.దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.ఇక రబీ సాగు కూడా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడంలేదు.



ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న చెవిరెడ్డి, బూచేపల్లి

ఘనంగా జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కేకును పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ కట్ చేశారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సమకూర్చిన చీరలను పేద మహిళలకు పంపిణీ చేశారు. తరువాత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జి చుండూరి రవిబాబు, రాష్ట్ర నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య , కె.వి.రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, రొండా అంజిరెడ్డి, దామరాజు క్రాంతి కుమార్, బొట్ల సుబ్బారావు, పార్టీ నగర అధ్యక్షులు కటారి శంకర్, కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్, వెన్నపూస కుమారి, తదితరులు పాల్గొన్నారు.